ప్రజాశక్తి
శుక్రవారం 10 జనవరి 2025
5
శ్రీకాకుళం

వాయుసేనలో అగ్నివీర్ నోటిఫికేషన్

శ్రీకాకుళం అర్బన్ : సికింద్రాబాద్‌లోని భారత వాయుసేన 12 ఎయిర్ మెన్ సెలక్షన్ సెంటర్ పరిధిలో క్లరికల్, టెక్నికల్ కేడర్‌లో అగ్నివీర్ వాయు పోస్టులకు నోటిఫికేషన్‌న విడుదలైనట్లు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, ఐటిఐ, పాలిటెక్నిక్ డిప్లమో పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. సంబంధిత విద్యార్హత గల అభ్యర్థులు ఈనెల 27వ తేదీ లోగా https://agnipathvayu.cdac.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. భారత వాయుసేనలో చేరడం వల్ల దేశసేవ చేసే అవకాశం లభిస్తుందని, పలు రంగాల్లో కెరీర్‌ను నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రైవేట్ ట్రావెల్స్‌కు 'పండగ'

- భారీగా టిక్కెట్ల రేట్ల పెంపు
- డిమాండ్ బట్టి ఛార్జీల వసూలు
- సంక్రాంతి రద్దీ నేపథ్యంలో ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు
- సాధారణ ఛార్జీలతో ఊరట



సంక్రాంతి వేళ ప్రయివేటు బస్సులు టిక్కెట్ల ధరలను అమాంతం పెంచేశాయి. ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు తిప్పుతున్నా డిమాండ్ దృష్ట్యా అవకాశాన్ని ప్రయివేట్ ట్రావెల్స్ సొమ్ము చేసుకుంటున్నాయి. అధిక ధరలతో ప్రయాణికులను దోచేస్తున్నాయి. పండగ దగ్గరకొచ్చేసరికి టిక్కెట్ ధరలను పెంచుతూ పోతున్నారు. సాధారణ రోజుల్లోనే ఆర్‌టిసి కంటే అదనపు రేట్లు ఉండే ప్రయివేట్ బస్సుల్లో సుమారు రెట్టింపు సొమ్ములు వసూలు చేస్తున్నారు. మూడు రోజుల పెద్ద పండగ కావడంతో చేసేది లేక వ్యయ ప్రయాసలకోర్చి జనం సొంతూళ్లకు వెళ్తున్నారు. మరోవైపు సంక్రాంతి రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ప్రయివేట్ ట్రావెల్స్ భారీగా ఛార్జీలను వసూలు చేస్తున్న నేపథ్యంలో ఆర్‌టిసి సాధారణ ఛార్జీలను వసూలు చేయడం ప్రయాణికులకు కొంత ఊరటనిస్తోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సంక్రాంతి పండగ కావడంతో శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) వైపు వచ్చే రైళ్లన్నీ నిండిపోయాయి. రిజర్వేషన్లు ఓపెన్ చేసిన కొద్దిరోజులకే నో మోర్ బుకింగ్ అంటూ ఆన్‌లైన్ డిస్‌ప్లేలో కనిపించింది. వెయిటింగ్ లిస్టు చాంతాడులా ఉంది. ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు వరుసగా సెలవులు కావడంతో పదో తేదీ నుంచి ప్రయాణాలు మొదలుపెట్టారు. దీంతో 10, 11 తేదీల్లో చాంతాడులా వెయిటింగ్ లిస్టు ఉంది. పాఠశాలలు, కళాశాలలకు ఈనెల పదో తేదీ నుంచి 19వ తేదీ వరకు సెలవులు కావడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా దాదాపుగా 19వ తేదీనే తిరుగు ప్రయాణమయ్యే పరిస్థితి ఉండడంతో ఆ రోజూ రైళ్లకు విపరీతమైన డిమాండ్ నెలకొంది.

రైళ్లు నిండిపోవడంతో ప్రత్యామ్నాయంగా అంతా ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. దీన్నే ప్రయివేట్ ట్రావెల్స్ సొమ్ము చేసుకుంటున్నాయి. ప్రయాణ రద్దీ, ఆయా తేదీలను బట్టి డబ్బులను వసూలు చేస్తున్నాయి. ఆ తేదీల్లో బస్సులు లేవంటూ రెండు సీట్లు సర్దుబాటు చేస్తామంటూ సాధారణ రోజుల కంటే రెండింతలు పెంచి దోపిడీ సాగిస్తున్నాయి.

హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం వరకు అన్ని ప్రయివేటు ట్రావెల్స్ బస్సులను రూ.3,200 పైన వసూలు చేస్తున్నాయి. అదే ఆర్‌టిసి బస్సు నాన్ ఎసి (సూపర్ లగ్జరీ) బస్సులో రూ.1400 ఛార్జీ మాత్రమే తీసుకుంటున్నారు.

విజయవాడ నుంచి శ్రీకాకుళంకు అన్ని ప్రయివేట్ ట్రావెల్ బస్సులు రూ.1500 వరకు వసూలు చేస్తున్నాయి. ఆర్‌టిసి సూపర్ లగ్జరీలో రూ.860 మాత్రమే వసూలు చేస్తోంది. ప్రయివేట్ ఎసి బస్సుల్లో ఒక్కో టిక్కెట్‌కు రూ.రెండు వేల వరకు వసూలు చేస్తున్నారు. ఆర్‌టిసిలో ఇంద్ర (ఎసి) బస్సుకు రూ.1100 మాత్రమే తీసుకుంటున్నారు. ఆర్‌టిసిలో రానూపోనూ రిజర్వేషన్ చేసుకుంటే టిక్కెట్‌లో పది శాతం రాయితీ కూడా ఇస్తోంది. పండగ వేళ ఆర్‌టిసి సాధారణ ఛార్జీలే వసూలు చేస్తుండడంతో ప్రయాణికులకు కొంత ఊరట కలుగుతోంది.

సొమ్ము చేసుకుంటున్న ప్రైవేట్ ట్రావెల్స్

శ్రీకాకుళం నగరంతో పాటు టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం, కొత్తూరు తదితర ప్రాంతాల నుంచి 13 బస్సుల వరకు ప్రయివేట్ ఆపరేటర్లు తిప్పుతున్నారు. ఇవి విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ మీదుగా హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్తున్నాయి. ప్రధానంగా విజయవాడ, హైదరాబాద్ రూట్‌లోనే ఎక్కువగా నడపుతున్నారు. వీటితో పాటు నెల్లూరు రూట్‌లో తొమ్మిది ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులు నడుస్తున్నాయి. చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు ఒక్కో ప్రయివేట్ బస్సు తిరుగుతోంది. ఇందులో ఎసి, నాన్-ఎసి, స్లీపర్ సర్వీసులు ఉన్నాయి. సెలవులు, డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని అమాంతంగా ఛార్జీలను పెంచేశారు. ఉదాహరణకు

సంక్రాంతికి ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

సంక్రాంతి పండగ రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎపిఎస్ ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే వారి కోసం ఈనెల తొమ్మిది నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. తిరుగు ప్రయాణాలను దృష్టిలో పెట్టుకుని పండగ తర్వాత 17 నుంచి 19వ తేదీ వరకు తిప్పనున్నారు. హైదరాబాద్‌కు పది నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేకంగా 18 సూపర్ లగ్జరీ బస్సులను నడిపేలా ప్లాన్ చేశారు. గురువారం ఆరు బస్సులను హైదరాబాద్‌కు పంపారు. శ్రీకాకుళం నుంచి విజయవాడకు పది బస్సులు తిరుగుతుండగా, అదనంగా ఒక బస్సు నడుపుతున్నారు. రాజమండ్రి నుంచి శ్రీకాకుళానికి రెండు స్పెషల్ బస్సులు, టెక్కలి నుంచి అమలాపురానికి ప్రత్యేక బస్సు నడుపుతున్నారు. ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు అధిక రద్దీ ఉంటుందన్న అంచనాలతో విశాఖ నుంచి శ్రీకాకుళం రూట్‌లో 30 బస్సులు అదనంగా నడపనున్నారు. రద్దీని బట్టి పలాస, సోంపేట, పాతపట్నం ప్రాంతాలకు అదనంగా బస్సులు నడిపేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

రద్దీకనుగుణంగా ప్రత్యేక బస్సులు

సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని బస్సులను నడిపేలా ప్లాన్ చేశాం. ఏయే రూట్లలో అధిక రద్దీ ఉందో అందుకనుగుణంగా ప్రత్యేక బస్సులను సిద్ధం చేశాం. ఇప్పటికే హైదరాబాద్‌కు ఐదు బస్సులను పంపాం. ప్రయాణికుల అవసరాలను గుర్తించి అందుబాటులో ఉన్న స్పేర్ బస్సులను నడిపేందుకు సిద్ధంగా ఉన్నాం. విశాఖ కాంప్లెక్స్‌లో 24 గంటలూ పనిచేసేలా జిల్లా సిబ్బందితో ఒక టీమ్‌ను ఏర్పాటు చేశాం. రైళ్లు దిగే ప్రయాణికులను జిల్లాకు చేర్చేలా ప్రణాళికలు సిద్ధం చేశాం.

- ఎ.విజయ్ కుమార్,
జిల్లా ప్రజా రవాణా అధికారి

వంశధార ప్రాజెక్టు ఆధునికీకరణకు...

రూ.1500 కోట్లు కేటాయించాలి

- నిపుణులు చెప్తున్నా నిర్లక్ష్యం తగదు
- నదీ జలాల వినియోగంతో జిల్లా అభివృద్ధి
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వంశధార ప్రాజెక్టు ఆధునికీకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1500 కోట్లు వెంటనే కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వంశధార ప్రాజెక్టు జిల్లా అభివృద్ధికి గుండెకాయ వంటిదన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మించి 50 ఏళ్లు కావస్తుండడంతో శిథిలావస్థకు చేరుకుందని చెప్పారు. ఇదే శిథిలమైతే జిల్లాలో వ్యవసాయ రంగం మొత్తం కుప్పకూలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ ప్రాజెక్టు ఆధునికీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నిధులు కేటాయించడం లేదో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వంశధార నది ఎడమ కాలువ ద్వారా 1.50 లక్షల ఎకరాలు, కుడి కాలువ ద్వారా 80 వేల ఎకరాలు, హై లెవల్ కెనాల్ ద్వారా ఐదు వేల ఎకరాలు, ఫ్లడ్ ఫ్లో కెనాల్ ద్వారా 20 వేల ఎకరాలకు నీరందుతుందని తెలిపారు. వంశధార ప్రాజెక్టు నిర్వహణకు నిధుల్లేక శిథిలావస్థలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న వంశధార ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నిధులు కేటాయించడం లేదని ప్రశ్నించారు.

నిపుణులు చెప్తున్నా నిర్లక్ష్యం తగదు

వంశధార ఆధునికీకరణ కోసం కుడి కాలువ 104 కిలోమీటర్లు, ఎడమ కాలువ 73 కిలోమీటర్ల పొడవునా లైనింగ్ చేయడం కోసం రూ.800 కోట్లు, 250 స్ట్రక్చర్స్ పునర్నిర్మాణం కోసం రూ.300 కోట్లు, షట్టర్ల కోసం రూ.వంద కోట్లు, పిల్ల కాలువల మరమ్మతుల కోసం రూ.300 కోట్లు అవసరమవుతాయని నిపుణులు చెప్తున్నా, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

నిధులు ఎందుకు తేవడం లేదు

పాలకుల నిర్లక్ష్యమే జిల్లా వెనుకబాటుకు కారణమన్నారు. వంశధార ప్రాజెక్టు ఆధునీకరణ చేసి రెండు పంటలకు నీరు ఇస్తే వ్యవసాయ రంగం నుంచి రూ.వెయ్యి కోట్లకు పైగా ఆదాయం వస్తుందని చెప్పారు. తద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు వస్తాయన్నారు. వలసలు నివారించి జిల్లా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎస్ఐఎంపి (సపోర్ట్ ఫర్ ఇంప్రూవ్‌మెంట్ అండ్ మోడరైజేషన్ ఆఫ్ ప్రాజెక్టు) నుంచి వంశధార బ్యారేజీ ఆధునీకరణ కోసం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఎందుకు నిధులు తేవడం లేదని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే వంశధార బ్యారేజీని ఆధునీకరించాలని డిమాండ్ చేశారు. జిల్లా అభివృద్ధి అంటే ప్రజల ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం కాదని, నదీ జలాలను వినియోగించుకోవడమని స్పష్టం చేశారు. వంశధార ప్రాజెక్టు ఆధునీకరణ కోసం దశల వారీ పోరాటాలు చేస్తామన్నారు.

మరిన్ని వార్తల కోసం
www.prajasakti.com \ epaper.prajasakti.com

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

త్వరితగతిన రెవెన్యూ అర్జీల పరిష్కారం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారం ఆలస్యమవుతున్నట్లు కనిపిస్తోందని, ఇదే ఒరవడి కొనసాగితే బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్ నోడల్ ఆఫీసర్, రెవెన్యూ నోడల్ ఆఫీసర్, కంప్యూటర్ ఆపరేటర్లు సమన్వయంతో పనిచేసి, రైతుల సమస్యలను తొందరగా పరిష్కరించాలన్నారు.

విఆర్‌ఒలు తమ బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలకు రశీదులు ఇవ్వాలని, అర్జీలను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. అర్జీదారుల ఫోన్ నంబర్లను సరిగ్గా నమోదు చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి, అర్జీదారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కారం గురించి తెలుసుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్లు ఎం.అప్పారావు, బి.పద్మావతి, లావణ్య, ఆయా మండలాల తహశీల్దార్లు, ఉప తహశీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజానీకానికి మళ్లీ మోసం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

విశాఖ పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర ప్రజానీకాన్ని మళ్లీ మోసం చేసినట్లయిందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఉపాధ్యక్షులు వి.జి.కె మూర్తి ఒక ప్రకటనలో విమర్శించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి రాష్ట్ర, ప్రత్యేకించి ఏళ్ల తరబడి పోరాడుతున్న విశాఖ ప్రజలను తీవ్ర నిరాశలోకి నెట్టారని పేర్కొన్నారు. విశాఖ సభలో కూటమి నాయకులు ఒకరినొకరు పొగడ్తలతో సరిపెట్టుకున్నారని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ఊసెత్తకుండా దాటవేశారని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా గానీ, వెనుకబడిన జిల్లాలకు రావాల్సిన ప్రత్యేక ప్యాకేజీని గానీ పూర్తిగా మరిచిపోయారని తెలిపారు. ప్రజలు వద్దు మొర్రో అంటున్న బల్క్ డ్రగ్ ప్లాంట్ శంకుస్థాపన ఎవరి కోసం చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి వెనకబెట్టిన రైల్వే జోన్ శంకుస్థాపనలో గర్వపడడానికి ఏముందని పేర్కొన్నారు. విశాఖ ప్రజల తరపున గొంతు వినిపిస్తున్న వామపక్ష నాయకులను నిర్బంధించడం ప్రజాస్వామ్యమేనా అని ప్రశ్నించారు. 25 వేల మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కును బలిపీఠంపైకి నెట్టేస్తూ నక్కపల్లిలో ప్రైవేటు ఉక్కు ఫ్యాక్టరీని ప్రారంభించే యత్నం చేయడం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ ప్రభుత్వరంగాన్ని నిర్వీర్యం చేయడమేనని పేర్కొన్నారు. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేసి, ప్రైవేటీకరణ ప్రతిపాదన పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్లు తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

నేడు 'మీకోసం' రద్దు

ప్రజాశక్తి - పలాస

కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదిక (మీకోసం) ఈనెల మూడో తేదీన రద్దు చేసినట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ కారణంగా నిర్వహించడం లేదని పేర్కొన్నారు. కాశీబుగ్గ పరిసర ప్రాంత ప్రజలు ఈ విషయాన్ని గమనించి ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి రావద్దని కోరారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

- రాజ్యాంగంపై బిజెపికి విశ్వాసం లేదు
- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణికం

ర్యాలీలో పాల్గొన్న మాణికం ఠాగూర్

ప్రజాశక్తి - గార

రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని, లేకుంటే మంత్రివర్గం నుంచి ఆయన్ను బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి, ఎంపీ మాణికం ఠాగూర్ డిమాండ్ చేశారు. మండలంలోని అంబటివానిపేటలో గురువారం నిర్వహించిన జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్‌ను అనడం ఫ్యాషన్‌గా మారిందని, వాళ్లు అన్నిసార్లు అనడం కంటే దేవుడు పేరు స్మరిస్తే స్వర్గంలో స్థానం దక్కుతుందని అమిత్ షా వ్యాఖ్యానించడం బిజెపి అసలు రంగు బయటపడిందన్నారు. బిజెపి ఫాసిస్టు, నియంతృత్వ విధానానికి ఈ వ్యాఖ్యలు నిదర్శనమన్నారు. ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుతున్నది అంబేద్కర్ వల్లే అనే వాస్తవాన్ని మర్చిపోకూడదన్నారు. రాజ్యాంగంపై బిజెపికి, ఆ పార్టీ నాయకులకు విశ్వాసం లేదని విమర్శించారు. పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో మోడీ, అమిత్ షాలకు తగిన బుద్ధి చెప్తారన్నారు. పిసిసి మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ బిజెపి ముసుగులో ఆర్‌ఎస్‌ఎస్ పాలన సాగిస్తోందని విమర్శించారు. మనుస్మృతిని అమలు చేస్తూ రాజ్యాంగాన్ని మరుగున పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు.

ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త షేక్ మస్తాన్ వలీ మాట్లాడుతూ అట్టడుగున ఉన్న తరగతుల ప్రయోజనాలను దెబ్బ తీసేందుకు బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు, మమతా నాగిరెడ్డి, డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు, పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి జి.వెంకటరమణ, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పూడి కిరణ్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వి.ఎల్.ఎస్ ఈశ్వరి, ఎస్‌సి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెంబూరు మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

గోకులం పనులను పరిశీలిస్తున్న పీడీ సుధాకరరావు

నెలాఖరులోగా 'పల్లె పండగ' పనులు పూర్తి

డ్వామా పీడీ బి.సుధాకరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇంజినీరింగ్ విభాగం సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పల్లె పండగ రహదారి పనులను నెలాఖరులోగా శత శాతం పూర్తి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకరరావు ఆదేశించారు. శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలులో పల్లె పండుగ నిధులతో నిర్మిస్తున్న సిమెంట్ రహదారి పనులతో పాటు గోకులం నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ సిబ్బంది నిర్మాణాత్మక ధోరణితో విధులు నిర్వహించాలని మండల స్థాయి సిబ్బంది ప్రణాళికాబద్ధంగా లక్ష్యాలను అధిగమించాలన్నారు. గోకులాల నిర్మాణం పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలన్నారు. ఇంకుడుగుంతలు, ఇతర మెటీరియల్ కాంపోనెంట్ పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా మండలాల్లో కూలీలకు ఉపాధిని చూపించాలని, పని కోరిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలన్నారు. కూలీలకు ప్రయోజనం చేకూరే విధంగా క్షేత్రస్థాయి సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిశీలనలో మండల ఇంజినీర్ పి.బాల ముకుంద, టిఎ నాగమణి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమతో అధిక ఆదాయం

మల్బరీ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పొందూరు : పట్టు పరిశ్రమలో యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా రైతులు అధిక దిగుబడులను సాధించి ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చని జిల్లా పట్టు పరిశ్రమ అధికారి టి.రాజేంద్రప్రసాద్ బాబు అన్నారు. మండలంలోని రాపాక, మలకాంలో పట్టు సాగుపై రైతులకు గురువారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. హిందూపురంలోని పట్టు పరిశోధన మండలి శాస్త్రవేత్తలు సి.రమేష్, జె.సీతారాములు మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు మొదలుకొని, అధిక దిగుబడినిచ్చే వంగడాల ఎంపిక, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మీసాల మన్మథరావు, ఎపిఒ శ్రీనివాసరావు, ప్రొఫెసర్లు అనిత, కిరణ్మయి, రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న సిక్కోలు డ్వాక్రా బజారు

84 స్టాల్స్‌లో ఉత్పత్తుల విక్రయాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా సంయుక్తంగా నిర్వహిస్తున్న సిక్కోలు డ్వాక్రా బజారులో స్వయంశక్తి సంఘాలు విక్రయిస్తున్న ఉత్పత్తులు ఆకట్టుకుంటున్నాయి. నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద గల మున్సిపల్ మైదానంలో నిర్వహిస్తున్న డ్వాక్రా బజార్ మరో రెండు రోజుల పాటు కొనసాగనుంది. సంక్రాంతి దృష్ట్యా ఏర్పాటు చేసిన ఈ విక్రయ కేంద్రంలో 101 మంది స్వయం సహాయక సంఘాల మహిళలు 84 స్టాళ్లలో పలురకాల చేతి ఉత్పత్తులను ప్రదర్శించి అమ్ముతున్నారు. రూ.1.50 కోట్ల వ్యాపారాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ బజారును ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ సుమారు రూ.30 లక్షల మేర విక్రయాలు సాగిస్తున్నారు.

డ్వాక్రా బజారులో ప్రత్యేక ఆకర్షణలు

పలురకాల ఉత్పత్తులైన మంగళగిరి నేత చీరలు, కడప హాండ్‌లూమ్స్, లావేరు జూట్ బ్యాగ్స్, బుడితి ఇత్తడి, మందస కోవా, కొయ్యబొమ్మలు, ఆత్రేయపురం పూతరేకులు, మాడుగుల హల్వా, ఆమదాలవలస సేంద్రీయ బెల్లం, గుంటూరు కారం, పచ్చళ్లు, రణస్థలం చిరుధాన్యాల బిస్కెట్లు, పాతపట్నం ఇండోర్ ప్లాంట్స్ వంటి పలురకాల ఉత్పత్తులు ఈ బజారులో అందుబాటులో ఉన్నాయి. అలమండ మామిడితాండ్ర, సీతంపేట హెర్బల్, పొందూరు ఖాదీ, అనకాపల్లి ఏటికొప్పాక బొమ్మలు, వజ్రపుకొత్తూరు ఎండుచేపలు, నెత్తళ్లు, ఎచ్చెర్ల అప్పడాలు, గార మట్టి కుండలు, సరుబుజ్జిలి అగరబత్తులు ఇక్కడ ఆకర్షణగా నిలుస్తున్నాయి.

సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు

డ్వాక్రా బజారుకు వచ్చే వారికి అక్కడే ప్రధాన వేదికపై నిర్వహిస్తున్న కూచిపూడి, మిమిక్రీ, మాట్లాడే బొమ్మ, మ్యాజిక్ షో, కోలాటం వంటి కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన పలురకాల ఉత్పత్తులను ఇక్కడ విక్రయించడంతో పాటు చేనేత వస్త్రాలు, హస్తకళలు, ఆహార పదార్థాలు, సేంద్రీయ ఉత్పత్తులు మార్కెట్ రేటు కంటే ఇక్కడ తక్కువ ధరలకు అమ్ముతున్నారు.

డ్వాక్రా బజారులో విక్రయిస్తున్న ఉత్పత్తులు

CHANGE OF NAME

I, **TUNGANA RUDRAMURTHY,** S/o TUNGANA VASU, resident of Door No.18-17-353, Rekula Colony, Sompeta village, Sompeta P.O., Sompeta Mandal, Srikakulam District, A.P., changing the name of my son from TUNGANA PRAVEEN (Old Name), s/o TUNGANA RUDRAMURTHY to **TUNGANA PAVAN** (New Name), S/o **TUNGANA RUDRAMURTHY** for all purposes.

CHANGE OF NAME

I **SAMALLA SWATHI,** W/o SAMALLA VAIKUNTA MURTY, and residing at flat No 503, Siva Gowri Apartment, B.S. Colony, Sompeta, (Vill/Po) Srikakulam (Dist) Ph: 8247277370. Changing my name from **MADINA SWATAMMA**(Old name) to **SAMALLA SWATHI,** W/o Samalla Vaikunta Murty (New name). Hence forth i am being Called **SAMALLA SWATHI** (New Name) for all Purposes.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

నరసన్నపేట : భోగి మంట వేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

టెక్కలి : అలరించిన చిన్నారుల వేషధారణలు

ఆమదాలవలస : సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు

పొందూరు : ఆకట్టుకున్న సంప్రదాయ బొమ్మల కొలువు

రణస్థలం రూరల్ : సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

శ్రీకాకుళం అర్బన్ : డాన్సులు చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి – పొందూరు

మండలంలోని భాన్యం హైస్కూల్లో ప్రిన్సిపాల్ టి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ వేషధారణలతో 60 రకాల పిండివంటలను చేసి బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. అలాగే భోగి మంటలను వేయడంతో పాటు పాలు పొంగించి, సాంప్రదాయ నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అలాగే తాడివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కంటయ్య ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు భోగి మంటలను వేసి నృత్యాలు చేశారు. అలాగే తండ్యాం పంచాయతీ గూనాపేట ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం బి.మధుబాబు ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను జరిపారు. ఈ సందర్భంగా సాంప్రదాయ వేషధారణలు ఆకట్టుకున్నాయి.

నరసన్నపేట : ఎల్‌విజిఆర్ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ప్రిన్సిపాల్ ఎం.ప్రసాదరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు రంగోలి, కోలాటం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ విద్యార్థులకు సంక్రాంతి విశిష్టతను వివరించారు. ప్రతి విద్యార్థి సంస్కృతి సంప్రదాయాలను, ఆచారాలను పాటించాలని, వాటికి కట్టుబడి ఉండాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ జి.వి.జగన్నాథ్, ఎన్ఎస్ఎస్ పిఒ మోహనరావు, డి.కోటీశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్కలి: హిందువుల పవిత్రవర్ధినమైన సంక్రాంతి పర్వదినాల విశిష్టత విద్యార్థి దశ నుంచే అలవడాలని రవీంద్రభారతి పాఠశాల డీన్ నాగరాజు, ప్రిన్సిపాల్ ఎం.పద్మజ కోరారు.

ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా రవీంద్రభారతి పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలతో పాటు చిన్నారుల వేషధారణలు పలువురిని అలరించాయి. గ్రామీణ ప్రాంత వాతావరణాన్ని గుర్తుచేశారు. చిన్నారులకు భోగిపళ్లు పోశారు. పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజతో పాటు డీన్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండలంలోని చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎం.అనూరాధ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు వేసిన రంగవల్లులు, వేషధారణలు, సాంప్రదాయ నృత్యాలు పలువురిని ఆకర్షించాయి. పాఠశాల ఉపాధ్యాయులు జగదీష్, వైకుంఠరావు, కరుమాన దాలయ్య, బాడాన నారాయణ రావు, నారాయణరావు, జ్యోతి, సుధారాణి, మోహినీకుమారి, చిన్నారావు విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక అమ్మఒడి పాఠశాల ఆవరణలో డైరెక్టర్ బరాటం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు సాంప్రదాయ నృత్యాలు, వేషధారణలు, హరిదాసు కీర్తనలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక ఓక్రిడ్ అంతర్జాతీయ పాఠశాలలో నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాల్లో డిఇఒ [illegible] దసుపుడూ చిన్నారావులు పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ మల్ల మధులత ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా భోగి మంటలు వేశారు. అనంతరం గంగిరెద్దుల వేషధారణ, గొబ్బెమ్మలు ప్రదర్శన, హరిదాసుల సంకీర్తనలు, వంటి వేషధారణలతో విద్యార్థులు చేసిన ప్రదర్శనలు అలరించాయి.

రణస్థలం రూరల్: మండల కేంద్రంలోని సూర్య స్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పాల్గొన్నారు. పలు వేషధారణలతో అలరించిన విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బందికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ముగ్గులు, ముగ్గుల మధ్య గంగిరెద్దుల సందడి, హరిదాసు వేషధారణ, విద్యార్థులతో ప్రదర్శించిన అనేక నృత్యప్రదర్శనలు, సంప్రదాయబద్ధమైన దుస్తుల అలంకరణ అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఎంఇఒ అజ్జాడ త్రినాధరావు, సూర్య కరస్పాండెంట్ చింతపల్లి వీర వెంకటరావు, ప్రిన్సిపాల్ గురాల సత్యవతి, గురాల జగన్నాధరావు, పిసిని జగన్నాధం నాయుడు, మన్నె లక్ష్మీప్రసాద్, సిఆర్‌పి శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలోని తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు భోగిమంటలు, రంగవల్లులు, కోలాటం, సంక్రాంతి పాటలను నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. ఎం.సత్యనారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ డా పి.రామారావు, ఐక్యూఎసి సమన్వయకర్త డా డి.పైడితల్లి, శ్రీనివాసరావు, ఆర్.చంద్రశేఖరరావు, పి.సీతారాం, వి.అచ్యుతరావు, ఎం.హారిక, వై.రమణమూర్తి విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: తెలుగువారి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని ఎపి ఎన్‌జిఒ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు అన్నారు. నగరంలోని పిఎన్‌కాలనీలో ఉన్న న్యూసెంట్రల్ స్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. హరివిల్లులు, రంగురంగుల ముగ్గులు, హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, కొలువుదీరిన బొమ్మల కొలువు, సంప్రదాయ దుస్తులు, పులివేషాలు, చిన్నారుల సందళ్లు, సంప్రదాయ దుస్తుల్లో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఆ ఆవరణమంతా సంక్రాంతి వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో నృత్యదర్శకుడు రఘుపాత్రుని శ్రీకాంత్ ఆధ్వర్యాన నృత్యాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో స్కూల్ వ్యస్థాపకులు పి.జగన్మోహనరావు, డైరక్టర్ శ్రీకాంత్, శ్రీదేవి, రమాకుమారి, బలివాడ మల్లేశ్వరరావు, డాక్టర్ కనుగుల సుధీర్, అంధవరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే నగరంలోని రవీంద్ర భారతి పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ ఘోర చంద్ పల్క భోగి మంటలను వెలిగించి విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ఆవరణలో ముగ్గులు, గొబ్బెమ్మలు, పూలతో అలంకరించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు వేసిన పలు వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆట, పాటలతో విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమంలో డీన్ నాగరాజు, డిఐ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలాగే శార్వాని స్కూల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గంగిరెద్దులు, హరిదాసు, విద్యార్థుల వేషధారణ పోటీలను నిర్వహించారు. చైర్మన్ అందవరపు సూరిబాబు, డైరెక్టర్ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ రేఖ తదితరులు పాల్గొన్నారు.

కవిటి : తెలుగు సంప్రదాయాల సంస్కృతికి మరోరూపం సంక్రాంతి అని కళ్యాణి ఆంగ్ల పాఠశాల ఎఒ రాణి, ప్రిన్సిపాల్ బిందుమాధవి అన్నారు. స్థానిక కళ్యాణి ఆంగ్ల పాఠశాల, ముత్యాతలపేట జిల్లా పరిషత్ ఉన్నత, కవిటికొత్తూరులోని బివికె, పాఠశాలల ఆవరణంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను, స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి ఎఒ రాణి, ప్రిన్సిపాల్ బిందు మాధవి పూలమాలలతో అలంకరించి అనంతరం భోగి మంటలను వెలిగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల రంగోలీలు, గాలిపటాలతో, హరిదాసులు గోదాదేవిల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్రాంతి పండగను సంతోషంగా నిర్వహించుకోవాలని కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. మేజర్ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు దుస్తులు, సంక్రాంతి కానుకలను గురువారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని, సంస్కృతి సంప్రదాయాలకు వేదికైనా సంక్రాంతి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఈవో వీరభద్ర స్వామి, జూనియర్ అసిస్టెంట్ రవికిరణ్, నూకరాజు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: నేటి తరానికి సాంప్రదాయాలు పద్దతులు నేర్పించాలని జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు పాలిన శ్రావణి అన్నారు. మండలంలోని పూండిలోని సాయి వినీత్ విద్యా సంస్థల ఆవరణలో సంస్థ అధినేతలు, వైద్యులు చాపర లీలా, కోదండరావు ఆధ్వర్యాన నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా భోగి మంటలు వేసి, చిన్నారులకు భోగిపళ్లతో సత్కరించారు. విద్యార్థులు వారి తల్లులతో కలిసి రంగవల్లులు పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వివిధ వేషధారణలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి నృత్యాలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పూజితాదేవి, సర్పంచ్ పాలిన రమ్య, మాజీ ఎంపిపి గొరకల వసంతస్వామి, అగ్ని కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, ప్రిన్సిపాల్ అన్నెపు కైలాసరావు, ఉపాధ్యాయులు బత్తిని శ్రీను, సాయి, షణ్ముఖరావు, ధర్మారావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని పురుషోత్తంపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వై.లత ఆధ్వర్యాన ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణ ధరించారు. రంగవల్లులు, భోగి మంటలు వేశారు. కొలిగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎం.నరేంద్రనాథ్ పట్నాయక్ ఆధ్వర్యాన ముందుస్తు సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించారు. విద్యార్థులు ఒరియా భాషలో సంక్రాంతి ఆకారం కూర్చొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రోబిన్ కుమార్ పాఢి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఆధ్వర్యాన ముందస్తు సంక్రాంతిని నిర్వహించారు.

పాతపట్నం : స్థానిక విజ్ఞాన్ స్కూల్ ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు వివిద రంగులతో ముగ్గులు అలంకరణగా వేశారు. సంప్రదాయ దుస్తులలో పాల్గొని గొబ్బెమ్మలతో, హరిదాసుల వేషధారణలో ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలాస : స్థానిక మదర్ థెరీసా పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గంగిరెద్దుల విన్యాసాలు, పిండి వంటలు, సంప్రదాయ దుస్తులు ధరించి కోలాటం ఆట పాటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు నృత్యాలు చేశారు. అనంతరం భోగి మంటల్లో భోగి పళ్లు వేశారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, పాఠశాల కరస్పాండెంట్ వజ్జ గంగా భవాని పాల్గొన్నారు. అలాగే మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎస్.వి.రమణ, రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో కరస్పాండెంట్ మల్లా కామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.

సోంపేట : స్థానిక మహర్షి విద్యానికేతన్‌లో ముందస్తు సంక్రాంతి నిర్వహించారు. ఎల్‌కెజి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పంచకట్టులు, చీరలు కట్టుకుని చూపర్లకు అలరించే విధంగా వస్త్రధారణ చేసుకున్నారు. భోగి మంటలో రేగిపళ్లు వేశారు. కార్యరకమంలో బట్టిగొల్లఊరు, కొర్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిరి సౌజన్య, స్కూల్ యాజమాన్యం జి.వి.ఎస్.ఎస్.ప్రసాద్, వివెల్ శకుంతల, ఎ.పి.మురళి, వెదుళ్ల తిరుపతిరావు, ప్రధానోపాధ్యాయులు తరణి ప్రసాద్ పండా, ఉపాధ్యాయులు పిల్లి భాస్కరరావు, మోహన్, లలిత, గీత, ప్రసన్న, బాలు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక రాజ్‌శ్రీనివాస్ ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు కోలాటం, ఆటపాటలతో ఆలవించారు. గంగిరెద్దుతో విన్యాసాలు చేయించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు భూదేవి, చిన్నమనాయుడు, ప్రిన్సిపాల్ తిరుపతిరావు, ఎఒ సింహాచలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : 'శర్వాణి'లో సంక్రాంతి సంబరాలు

పలాస : భోగి మంట వేస్తున్న బాబూరావు

సోంపేట : సంప్రదాయ వేషధారణలో మహర్షి విద్యార్థులు

ఇచ్ఛాపురం : భోగి మంటలు వేసిన విద్యార్థులు

కవిటి : దుస్తులను అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు

రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

సచివాలయం సందర్శన

మెళియాపుట్టి : మండలంలోని వసుంధర సచివాలయాన్ని టెక్కలి డిఎల్‌పిఒ ఐ.వి.రమణ, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్‌పండా గురువారం సందర్శించారు. ఈ మేరకు రికార్డులను పరిశీలించారు. పారిశుధ్యంలో భాగంగా గ్రామంలోని డ్రెయినేజీలను పరిశీలించారు. పారిశుధ్యం లోపించకుండా చూడాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి మనోహర్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనూష తల్లికి ఆర్థికసాయాన్ని అందజేస్తున్న సింహాచలం

విద్యార్థినికి ఆర్థికసాయం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని గుజరాతీపేటకు చెందిన అనూష నూజివీడు ఐఐఐటిలో ఇఇఇ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమెకు ఇటీవల బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో అస్వస్థతకు గురై కోమాలోకి వెళ్లిపోయింది. ఆమెను విజయవాడలోని మణిపాల్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స నిర్వహిస్తున్నారు. ఆమె కుటుంబం నిరుపేదలు కావడంతో సాయం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈవిషయాన్ని తెలుసుకున్న సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి సభ్యులు మిత్రుల సహకారంతో రూ.11వేలు పోగు చేసి ఆకుటుంబానికి అందజేశారు. ఆమె కోలుకునేందుకు దాతలు మరింత సహకారాన్ని అందించాలని సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితిసభ్యులు సింహాచలం, జరుగుల్ల రామారావు కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం

బూర్జ: మండలంలోని పాలవలస జడ్‌పి హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా కేస్‌వర్కర్ కుప్పిలి ప్రసన్నరాణి మాట్లాడుతూ సమాజంలో మహిళలు, ఆడపిల్లలను చదివించడంతో పాటు, వారి స్వీయ రక్షణకై విద్యార్థినులకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, సురక్షిత స్పర్శ, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, గృహహింస, మానవ అక్రమ రవాణా, అత్యాచారాలు వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. నిరాశ్రులైన ఆడపిల్లలకు, మహిళలకు జిల్లా మహిళా శిశు అభివృద్ధి శాఖ నిర్వహిస్తున్న హోమ్స్ ఉన్నాయని తెలిపారు. ఆడపిల్లలకు మహిళలకు ఎటువంటి కష్టం కలిగినా 100, 1098, 181, 112 హెల్ప్‌లైన్ నెంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రతాప్ రుద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ప్రసన్నరాణి

కొలతల మేరకు పనులు చేయించాలి

కోటబొమ్మాళి : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ఎచ్చెర్ల: పని ప్రదేశాల్లో కూలీలతో కొలతల మేరకు పనులు చేయించాలని, తద్వారా కూలీలకు గరిష్ట వేతనం వస్తుందని ఎపిడి కె.లోకేష్ అన్నారు. గురువారం ఆమదాలవలస, ఎచ్చెర్ల మండలాల ఉపాధి హామీ పథకం సిబ్బంది శిక్షణా తరగతుల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వ్యక్తిగత పనులకు ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. ఫీల్డు అసిస్టెంట్లు, మేట్లు సాంకేతిక అంశాలపై అవగాహన ఏర్పర్చుకుని పనులు చేయించాలని ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ పనులు చేపట్టడం ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, రైతాంగానికి ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. అనంతరం జిల్లా రిసోర్స్‌పర్సన్లు గౌరినాయుడు, సందీప్, నారాయణమ్మ, నరేష్, ప్రభాకరరావు, సిబ్బందికి వివిధ రకాల పనులు చేపట్టే విధానం, సాంకేతిక అంశాలపై అవగాహనతో పాటు క్షేత్రస్థాయిలో కొలతలు వేసి పనులు చేయించడం వంటి అంశాలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల, ఆమదాలవలస ఎపిఒలు శోభాదేవి, అప్పలనరసమ్మ, ఎఇసి రాము, టిఎలు సురేష్, సుధాకర్, రమణ, రెండు మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలో జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా నిర్వహించనున్న పనులపై ఫీల్డు అసిస్టెంట్లుకు పూర్తిస్థాయి అవగాహన ఉండాలని ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల ఫీల్డు అసిసెంట్లుకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గుర్తించిన పనులు వాటికి సంబంధించిన నిధులు, కొలతలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎపిడి శైలజ మాట్లాడుతూ పనులు జరుగుతున్నప్పుడు ఫీల్డు అసిస్టెంట్లు కూలీలకు మారుతున్న సాంకేతకను అవగాహన కల్పించాలన్నారు. డిఎల్‌ఆర్ వై.వి.రమణ, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి ఎపిఒలు జి.హరిప్రసాద్, పి. నర్సింహమూర్తి, ఇసిలు టి.రాంబాబు, యు.ధర్మారావు పాల్గొన్నారు.

పొందూరు: మండల పరిషత్ కార్యాలయంలో పొందూరు, జి.సిగడాం మండలాల ఉపాధి హామీ సిబ్బందికి ఎపిడి లోకేష్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మీసాల మన్మధరావు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎపిఒలు శ్రీనివాసరావు, సత్యనారాయణ, రిసోర్స్‌పర్సన్ పురుషోత్తం, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : మాట్లాడుతున్న ఎపిడి లోకేష్

తెగుళ్లపై అవగాహన

ప్రజాశక్తి – ఎచ్చెర్ల

మండలం తమ్మినాయుడుపేటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ జెడి త్రినాథస్వామి పాల్గొని మినుము, పెసర పంటల్లో పల్లాకు తెగులు ఉధృతి తగ్గడానికి నివారణ చర్యలు, దిగుబడి పెరగడానికి మల్టీ– కె వంటి పోషకాలు పిచికారి చేసుకోవాలని రైతులకు వివరించారు. అదే విధంగా ఖరీఫ్ వరి రైతులు తొందరగా నూర్చుకొని కొనుగోలు కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరకు అమ్మకం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమములో శ్రీకాకుళం సబ్‌డివిజన్ ఎడిఎ బి.రజిని, మండల వ్యవసాయాధికారి వై.సురేష్, ఎఇఒ అరుణమణి, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

వాకర్స్ ఇంటర్నేషనల్-102 గవర్నర్‌గా కొంక్యాన మురళీధర్

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

మురళీధర్

వాకర్స్ ఇంటర్నేషనల్–102 గవర్నర్‌గా కొంక్యాన మురళీధర్ నియమితులయ్యారు. ఈ నెల 10న సాయంత్రం నాలుగు గంటలకు జెడ్‌పి సమావేశ మందిరంలో ఇంటర్నే షనల్ ప్రెసిడెంట్ ముళ్లపూడి ప్రభావతి సమక్షంలో ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రస్తుత గవర్నర్ జామి నారాయణరావు, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, డాక్టర్ కిల్లంశెట్టి పాండురంగారావు, డాక్టర్ మధుకర్ విలేకర్, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కొన్న వెంకటేశ్వరరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్ సలీమ్ షాక్, ఉపాధ్యక్షులు డాక్టర్ నాగేంద్రరావు, ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ రవిరాజు, వి.మురళీమోహన్, ఎస్. పి.రవీంద్ర, నేతాజీ సుబ్బారెడ్డి, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన వాకర్స్ క్లబ్ ప్రతినిధులు హాజరుకానున్నారని మురళీధర్ తెలిపారు.

ఆకట్టుకున్న పురాతన వస్తు ప్రదర్శన

ప్రదర్శిస్తున్న పురాతన వస్తువులు

ప్రజాశక్తి – పలాస

మండలం రామకృష్ణాపురంలోని సత్యసాయి విద్యా విహార్‌లో ఉద్దానం రచయితల సంఘం (ఉరసం) ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన పురాతన వస్తు ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ప్రదర్శనను ప్రముఖ సామాజిక సేవకులు, విద్యావేత్త జి.లింగరాజు, స్కూల్ ప్రిన్సిపాల్ బి.ప్రీతిచౌదరి, కరస్పాండెంట్ మల్లా రామేశ్వరరావు ప్రారంభించారు. ప్రదర్శనలో సాంప్రదాయ వ్యవసాయ పనిముట్లుతో పాటు పురాతన కాలానికి చెందిన వందలాది దేశీయ, విదేశీ నాణేలను ప్రదర్శించారు. పురాతన కాలానికి చెందిన గ్రామ ఫోన్ రికార్డు ప్లేయర్స్, క్యాసెట్ ప్లేయర్స్, రేడియోలు, టెలిఫోన్లు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పురాతన కిరోసిన్ దీపాలు, పెట్రోమాక్స్ కెరోసిన్ లైట్లు పెద్దలను అమితంగా ఆకర్షించాయి. గత కాలంలో వ్యవసాయ పనిముట్లుగా ఎంతో ప్రాచుర్యం పొంది ప్రస్తుతం కనుచూపుకు నోచుకోని ఎన్నో వస్తువులను ప్రదర్శనలో చూడడం ఆనందంగా ఉందని సందర్శకులు తెలిపారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కుత్తుం లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రదర్శనను సందర్శించి సాంప్రదాయాలకు నిలయమైన వస్తువులను ప్రదర్శనలో ఉంచడం విద్యార్థులకు సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహనకు ఉపయోగ పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉద్దానం రచయితల సంఘం అధ్యక్షులు వినోద్ కుత్తుం, పోతనపల్లి వెంకటేష్, కోయిల కోటేశ్వరరావు, కుత్తుం రోజారాణి, కుత్తుం లలిత, తెప్పల యశోద, బత్తిని వినోద్‌కుమార్, శాలిని మురళి పాల్గొన్నారు.

సంకల్పంతో విజయం

ప్రజాశక్తి – వజ్రపుకొత్తూరు

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించగలరని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి తవిటినాయుడు అన్నారు. మండలంలోని గోవిందపురం జూనియర్ కళాశాలను గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ మేరకు మధ్యాహ్న భోజన పథకం అమలు, కళాశాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ కళాశాలల్లో ఐఐటి, జెఇఇ మెయిన్స్‌కు తర్ఫీదు ఇస్తున్నామని అన్నారు. వచ్చే పరీక్షలో ఇప్పటి నుంచే పోటీపడి చదివి శత శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అదనపు తరగతులను నిర్వహించాలని అధ్యాపకులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్ పట్నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పలాస : విద్యార్థులు బలమైన సంకల్పంతో శ్రమిస్తే ఉత్తమ ఫలితాలు సాధించగలరని, ఇందుకు సమయపాలన కూడా అవసరమని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి (డివిఇఒ) ఎస్.తవిటినాయుడు అన్నారు. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సంకల్పం కార్యక్రమంలో గ్రేడులుగా విభజించిన తీరును పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో మాట్లాడుతూ ప్రణాళికాబద్ధమైన బోధనతో సి, బి గ్రేడుల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కుప్పిలి నరసింహమూర్తి, ఎజిఎంసి బాడ వెంకటమోహన్, గ్రంథాలయశాస్త్ర అధ్యాపకుడు పి.చిరంజీవులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న తవిటినాయుడు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి – పాతపట్నం

కృష్ణారావు (ఫైల్)

మండలంలోని కొరసవాడ శ్మశానం సమీపం మలుపు వద్ద లగేజీ వాహనం ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చాకపల్లికి చెందిన మారెడ్ల కృష్ణారావు (54) బైక్‌పై సారవకోట వెళ్తున్నాడు. కొరసవాడ వద్ద రాగానే వ్యాన్ బలంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి ఘటనాస్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టు మార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య నీలవేణి, కుమారులు నవీన్, తిరుపతి ఉన్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలము కున్నాయి. ఇన్‌ఛార్జి ఎస్ఐ రమేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు

పొందూరు: మండల కేంద్రం నాయుడువీధికి చెందిన ఎపిఎస్‌బి హెడ్ కానిస్టేబుల్ నల్లి వెంకట రమణకు స్వగ్రామం పొందూరులో గురువారం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పాడేరులో ఎపిఎస్‌బి హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకట రమణ బుధవారం పాడేరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. వెంకట రమణ మృతదేహాన్ని కుటుంబసభ్యులు గురువారం పొందూరు తరలించారు. ఎపిఎస్‌బి సిబ్బంది శ్మశానవాటికలో గాలిలో కాల్పులు జరిపి నివాళ్లర్పించారు. బంధువులు, స్నేహితులు కన్నీటివీడ్కోలు పలికారు.

ఇసుక అక్రమ తవ్వకాలు అడ్డగింత

కొత్తూరు: మండలంలోని ఆకులతంపార ఇసుక ర్యాంపులో గురువారం అక్రమంగా నది గర్భం నుంచి ప్రొక్లెయినర్ సహాయంతో తవ్వకాలు చేపడుతున్నారు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ అడ్డుకున్నారు. ఇసుక ర్యాంపు నుంచి స్థానిక తహశీల్దార్ రవిచంద్ర, సిఐ చింతాడ ప్రసాదరావుతో ఫోన్ మాట్లాడి లారీలను, ప్రొక్లెయినర్‌ను సీజ్ చేశారు. నది గర్భంలో అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు.

సామూహిక సీమంతాలు

సీమంతాలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తూరు: మండలంలోని కురిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ పి.ప్రసన్న కుమార్ అధ్యక్షతన గర్భిణులకు గురువారం సీమంతాలు నిర్వహించారు. పాతపట్నానికి చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు సౌజన్యంతో పిఎం సురక్షిత్ మాతృత్వ అభియాన్‌లో భాగంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భంలోని బిడ్డ ఆరోగ్యకరంగా ఎదగడానికి, తల్లి శారీరక, మానసికోల్లాసం ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, అప్పల నరసమ్మ, ఇఒ బుచ్చిబాబు, తిరుపతిరావు, నేత్ర వైద్యులు ఐ.జానకి రామయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కరుణాకరరావు

గ్రామ సర్వే శత శాతానికి కృషి

ప్రజాశక్తి- పాతపట్నం

మిస్సింగ్ సిటిజన్ హౌస్ వర్డ్ సర్వే శత శాతం పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మంచు కరుణాకరరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సెక్రటరీలు, విఆర్ఒలు, ఎనర్జీ అసిస్టెంట్లతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సచివాలయ ఉద్యోగీ మిస్సింగ్ సిటిజెన్ హౌస్ వర్డ్ సర్వే శత శాతం పూర్తయే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా ఏమైనా ఇబ్బంది కలిగితే సంబంధిత శాఖాధికారులతో మాట్లాడి పరిష్కారం చేసుకోవాలన్నారు. తహశీల్దార్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రైస్ కార్డు, ల్యాండ్ రికార్డుల్లో తప్పిపయిన సిటిజన్స్ గురించి విపులంగా వివరించారు. వాటిని ఎలా అప్‌లోడ్ చేయాలనేది అవగాహనకల్పించారు. ఎంపిడిఒ చంద్రకుమారి మాట్లాడుతూ సిఎం సూర్యఘర్ పథకం గురించి వివరించారు. ప్రతిఒక్క పంచాయతీ నుంచీ ఇద్దరు లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి సూర్య ఘర్ పథకం వర్తింప చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి వెంకటరావు, విద్యుత్‌శాఖ ఎఇ, డిటి ప్రసాదరావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న నరసింహమూర్తి

ప్రకృతి వ్యవసాయంతో లాభం

ప్రజాశక్తి- పాతపట్నం

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ప్రకృతి వ్యవసాయం మంచిదని డిఎంఎంటి ఎం.నరసింహమూర్తి అన్నారు. మండలంలోని సింగుపురంలో డోల రాజేశ్వరరావు పొలంలో 29 సెంట్లు విస్తీర్ణంలో ఎటిఎం మోడల్ పద్ధతిలో కూరగాయ విత్తనాల నారును గురువారం వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రకాల కూరగాయలను ఎటిఎం మోడల్‌లో ఒకే దగ్గర వేయడం వల్ల రైతులకు మంచి ఆదాయం వస్తుందన్నారు. పలురకాల పంటలు సాగుచేయడంతో రైతులకు అనేక రకాలుగా మేలు చేకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పిలు డి.జగన్నాయకులు, ఎస్.నారాయణరావు, పి.మధుసూదనరావు, పి.ధర్మారావు, వై.భీమారావు, కె.కళావతి, జె.వనజాక్షి, జె.ఆదామ్మ, కె.శకుంతల పాల్గొన్నారు.

12న జాతీయ యువజనోత్సవం

శ్రీకాకుళం అర్బన్ : స్వామి వివేకానంద జన్మదినాన్ని పురష్కరించుకుని ఏటా జనవరి 12న నిర్వహించే జాతీయ యువజనోత్సవాలను ఆదివారం నిర్వహిస్తున్నట్టు వివేకానంద సేవాసమితి సభ్యులు కెవిఎన్ మూర్తి, డా.జామి భీమశంకర్, సురంగి మోహనరావు, యోగా రామారావు తెలిపారు. గురువారం చైతన్య సహకార జూనియర్ కళాశాలలో విలేకరుల తో మాట్లాడారు. నగరంలోని సూర్యమహల్ కూడలి వద్ద గల స్వామి వివేకానంద కాంస్య విగ్రహం వద్ద అంజలి ఘటించనున్నట్టు తెలిపారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌లు అతిధులుగా హాజరు కానున్నట్టు తెలిపారు. ఈ వేడుకలను విజయవంతం చేయాలని వారు కోరారు.

నిత్యాన్నదానానికి విరాళం

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన గుడ్ల పవన్‌సాయి రూ.1,00,111 విరాళాన్ని అందజేశారు. గురువారం ఆలయన్ని సందర్శించి ఆలయ సూపరింటిండెంట్ కనకరాజును కలిసి చెక్కును అందజేశారు.

జాతీయ కాపు సంఘ ప్రధాన కార్యదర్శిగా 'వేల్పుల'

సరుబుజ్జిలి : జాతీయ కాపు సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల ప్రధాన కార్యదర్శిగా సరుబుజ్జిలికి చెందిన వేల్పుల గోవిందరావు నియమితులయ్యారు. గురువారం ఈ మేరకు ఆ సంఘ జాతీయ అధ్యక్షులు కర్ణ మురళీకృష్ణ నాయుడు వేల్పులను ఎంపిక చేసినట్లు ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ సందర్భంగా వేల్పుల మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లా కాపు ప్రతినిధులతో పాటు రాష్ట్ర కాపుకుల ప్రతినిధుల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసి జాతీయ సంఘం తనపై పెట్టిన బాధ్యతను నెరవేరుస్తానని ఆయన తెలిపారు.

ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం తగదు

అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మణ్‌కుమార్

ప్రజాశక్తి- పలాస

మండలంలోని రామకృష్ణాపురం వద్ద సర్వే నంబరు 143లో 2018లో రెండు ఎకరాల లేఅవుట్ రాజకీయాలకతీతంగా ఏర్పాటు చేశారని, దీనిపై పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, ఆమె భర్తపై ఇచ్ఛాపురానికి చెందిన వైసిపి నాయకులు నర్తు ప్రేమ్‌కుమార్‌కు తగదని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కుత్తుమ లక్ష్మణకుమార్ అన్నారు. ఈ మేరకు లేఅవుట్ వద్ద గురువారం లబ్ధిదారులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 2018లో అన్నాబత్తుల వెంకటరమణ, ఆదినారాయణ సోదరుల వద్ద తాను కొనుగోలు చేసి లేఅవుట్ వేసి అమ్మకాలు చేపట్టామన్నారు. 2011లో ఇచ్ఛాపురానికి ప్రేమకుమార్, మాజీ మంత్రి అప్పలరాజు ఈ స్థలం వద్దే తనపై దాడి చేసి

మాట్లాడుతున్న లక్ష్మణకుమార్

ఆక్రమించుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై కోర్టులో కేసు ఉందన్నారు. దీనిలో ఎమ్మెల్యే శిరీష కుటుంబంతో ఎటువంటి సంబంధం లేదని, వారిపి ప్రేమకుమార్ ఆమెపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని సచించారు. కార్యక్రమంలో ఎరయ్య, గుప్తా, లబ్దిదారులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద స్ఫూర్తి కావాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రపంచ మానవాళికి మార్గదర్శి స్వామి వివేకానంద సిద్ధాంతాలు, ఆశయాలు విద్యార్థులకు స్ఫూర్తి కావాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యాంసుందర్ అన్నారు. గురువారం పట్టణంలోని జూనియర్ కళాశాలలో శ్రీ శారద రామకృష్ణ సేవాసమితి సారధ్యంలో జాతీయ యువజన వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాల జాతీయసేవా పథకం నేతృత్వంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ

చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న ప్రిన్సిపాల్ శ్యాంసుందర్

యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేసిన వివేకానంద సాహిత్యాన్ని విద్యార్థులు తప్పనిసరిగా చదివి తెలుసుకోవాలన్నారు. యువజన ఉత్సవాల కన్వీనర్ మందపల్లి రామకృష్ణారావు, ఎన్ఎస్ఎస్ పిఒ జె. రవిబాబు, అధ్యాపకులు జి.ధనుంజయరావు, కె.రాజారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొలి క్లాప్ కొడుతున్న చిత్ర యూనిట్ సభ్యుడు

'మా ఊరోడే' సినిమా షూటింగ్ ప్రారంభం

ప్రజాశక్తి- పలాస

పలాస, మెళియాపుట్టి సరిహద్దు గ్రామాల్లో గురువారం 'మా ఊరోడే' ఒటిటి చలన చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ఎఆర్కే వరల్డ్ క్రియేషన్స్ బ్యానర్‌పై మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన రాపాక రామకృష్ణ (అమ్మ రామకృష్ణ) దర్శకత్వంలో డాక్టర్ కుమార్ నాయక్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. వెల్లటూర్ కథా ఇతవృత్తాంతంతో సినిమాను చిత్రీకరిస్తున్నారు. ఎస్.చిరంజీవి సమర్పణలో ప్రముఖ జానపద నృత్యకళాకారుడు పత్రి తాతారావు చేతులమీదుగా క్లాప్ కొట్టారు. డైరెక్టర్ పి.యశోధ, అసిస్టెంట్ డైరెక్టర్లు ఇందవల్లి మోహన్, బాల నటుడు నిహాల్ రెడ్డి, నటులు అనీల్ కుమార్, తోట సింహాచలం, టి.విష్ణుమూర్తి, కనకమ్మ, మాధవి పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రైస్తవుల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని డా గంజి ఎజ్రా, బింకం బర్నబాస్, కె.వి.సాల్మన్‌లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కోరారు. కలెక్టరేట్‌లో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. క్రైస్తవులకు ప్రతి మండలంలో స్మశానవాటిక నిర్మించాలని, క్రైస్తవ మతాన్ని స్వీకరించిన ఎస్‌సిలకు బిసిసి కుల ధ్రువీకరణ పత్రాన్ని మంజూరు చేయాలని కోరారు. ఇటీవల రిమ్స్ ఆస్పత్రిలో క్రిస్మస్ వేడుకల్లో అల్లర్లు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే హాయ్‌టీ నిర్వహణలో వైఫల్యం చెందిన మైనార్టీ అధికారిపై చర్య తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఓంపూరు రమేష్, రాడ విజయకుమార్, శామ్యూల్, ఆరుణ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పనులు చేయిస్తున్న కార్యదర్శి రాజు

కాలువల్లో పూడికల తొలగింపు

నౌపడ : సంతబొమ్మాళి మండలం భావనపాడులో కార్యదర్శి కె.రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం గురువారం నిర్వహించారు. గత ఐదురోజులుగా పారిశుధ్య కార్మికులు కాలువల్లోని పూడికలు తొలగించారు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తను, వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా తరలించారు. పారిశుధ్య నిర్వహణపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించి కాలువల్లో చెత్త వేయకూడదని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసంకల్ప యాత్ర సంబరాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మాజీ సిఎం వై.ఎస్‌జగన్మోహన్ రెడ్డి చేపట్టిన సుదీర్ఘ ప్రజా సంకల్ప యాత్రతో ప్రజల్లో వైసిపికి సుస్థిర స్థానం సంపాదించుకుందని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని లొద్దపుట్టి వద్ద ఉన్న ప్రజా సంకల్ప విజయా స్థూపం వద్ద గురువారం ఘనంగ సంబరాలు నిర్వహించారు. జగన్ ప్రజా సంకల్ప పాదయాత్ర చేపట్టి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ భారతీ దివ్య, ఎంపిపిలు ఉప్పాడ నారాయణమ్మ, పైల దేవదాస్‌రెడ్డి, కడియాల ప్రకాష్, జెడ్‌పిటిసి తడక

కేక్ కట్ చేస్తున్న విజయ

యశోద, ఇప్పిలి లోలాక్షి, శాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, నర్తు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం వెలికితీసేందుకే పోటీలు

బహుమతులు అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- కవిటి

విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీసేందుకు పోటీలు అవసరమని, అలాగే చదువులో విద్యార్థులు పోటీతత్వం కలిగివుండాలని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు అన్నారు. మండలం నర్తుపుట్టుగలో జరిగిన జిల్లాస్థాయి క్విజ్ పోటీలో విజేతలకు బుధవారం రాత్రి బహుమతులు అందించారు. ఈ పోటీలో హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం (రూ.6666తో పాటు షీల్డ్) కైవసం చేసుకోగా, బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (రూ.4444లతో పాటు షీల్డ్), కవిటి జిల్లా పరిషత్ ఒడియా ఉన్నత పాఠశాల (రూ.3333లతో పాటు షీల్డ్) విద్యార్థులు కైవసం చేసున్నారు. ఈ కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, వైసిపి నాయకుడు శ్రీకాంత్ పురియా, బిజి పుట్టుగ సర్పంచ్ బద్రి ప్రకాష్, ట్రూ ఫ్రెండ్స్ వ్యవస్థాపకుడు డా కృష్ణంరాజు, దట్టి అజయ్, నర్తు కోదండరావు, ఎన్.శివప్రసాద్, ఎస్.వామనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గున్నయ్య విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్థలం, నిర్మాణానికి నిధులు వెచ్చించిన దాత కీర్తిశేషులు పెంట గున్నయ్య విగ్రహాన్ని ఆయన మనువళ్లు, కుటుంబ సభ్యులు ఉపాధ్యాయుల సమక్షంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ బీద విద్యార్థులకు విద్యను అందించాలనే ఉద్దేశంతో గున్నయ్య ఉదారతతో దానం చేశారన్నారు. అప్పటి నుంచి వేల సంఖ్యలో విద్యార్థులు ఇక్కడ చదువుకొని దేశవిదేశాల్లో ఉన్నతస్థానాల్లో ఉండడం తమకు గర్వంగా ఉందన్నారు. స్కూల్ ఉన్నంత

గున్నయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన్న కుటుంబ సభ్యులు

వరకూ గున్నయ్య పేరు చిరస్థాయిగా ఉండాలనే ఉద్దేశంతో ఆయన 116 జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వై.చిన్నంనాయుడు, గున్నయ్య కుటుంబ సభ్యులు పెంట కృష్ణప్రసాద్, పెంట రత్నాకర్, సాయిరాం, డాక్టర్ నాగార్జున పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అండ

వజ్రపుకొత్తూరు: మండలంలోని కణితివూరుకు చెందిన మల్లేశ్వరరావు పార్వతి దంపతులకు చెందిన పొలంలో ఉన్న రెండు ఎకరాల వరిచేను కుప్పలు దగ్ధమయ్యాయి. అహర్నిశలు శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయానికి బూడిద కావడంతో రూ.2 లక్షలు నష్టం వాటిల్లింది. వరి కుప్పలు దగ్ధం కావడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. విషయం తెలుసుకున్న 1989-90 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు పార్వతి కుటుంబాన్ని ఓదార్చి రూ.15 వేలు ఆర్థికసాయం గురువారం అందజేశారు. కార్యక్రమంలో లాభాల సరిత, నిర్మల, ద్రౌపతి, మద్దిల హరినారాయణ, పేరాడ రమేష్, బొడ్డేపల్లి మోహనరావు, కీలు లోకనాథం, ఈపరి కృష్ణ, ఢిల్లీరావు, జామి మధు, పుత్స అప్పలస్వామి, దట్టి శాంతారావు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పరిశీలిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

మండలంలో తుల సమ్మ ఆలయం వద్ద బైక్‌పై గురువారం వస్తుండగా ప్రమాదానికి గురై గాయపడ్డాడు. అటుగా వెళుతున్న సుడాప్ మాజీ చైర్మన్ శ్యామ్ ప్రసాద్‌రెడ్డి స్పందించి మానవత్వంతో ఆదుకుని క్షతగాత్రుడిని తన కారులో స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. ఈయనకు కౌన్సెలర్ బచ్చు జగన్‌రెడ్డి సహాయ సహకారాలు అందేశారు. క్షతగాత్రు ని సెల్‌ఫోన్‌లోని నంబరు ఆధారంగా ధర్మపురం గ్రామస్తులకు, పోలీసులకుసమాచారం అందించారు.

పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కోటబొమ్మాళి: పాఠశాలలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఎల్.వి.ప్రతాప్ అన్నారు. గురువారం స్థానిక ఎంఇఒ కార్యాలయంలో మండలంలో గల 106 పాఠశాలలకు సంబంధించిన మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచే మెటీరియల్, లిక్విడ్‌లను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు సందర్భంగా పాఠశాలలు, వాటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు

బూర్జ : సంక్రాంతి సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో కోడి, గొర్రె పందాలు వంటివి ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమదాలవలస సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. సత్యనారాయణ హెచ్చరించారు. మారుమూల ప్రాంతాలతో పాటు పట్టణాల్లో కూడా ఎక్కడైనా జూదాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిపితే సహించేది లేదన్నారు. అలాగే బెల్ట్ షాపులు నిర్వహించిన వారిపై చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. ముఖ్యంగా బూర్జ మండలంలోని పలు గ్రామాల్లో రహస్య ప్రాంతాల్లో పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వీటిపై గట్టి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు.

12న 5కె రన్

పలాస : మండలంలోని నీలావతి ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యాన ఈ నెల 12న 5కె రన్ నిర్వహిస్తున్నట్లు ఉద్దాన విద్యాభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి గొరకల లోకేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలం గరుడభద్ర కూడలి నుంచి పెద్దనీలావతి యువివి గ్రంథాలయం వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకటఅప్పారావు పాల్గొంటారని చెప్పారు. ప్రథమ బహుమతి రూ 5 వేలు, రెండో బహుమతి రూ.4 వేలు, మూడో బహుమతి రూ.3 వేలు, నాలుగో బహుమతి రూ.2 వేలు, ఐదో బహుమతి రూ.వెయ్యి అందజేస్తామన్నారు.